భావిగి గుడిలో.. రాయచోటి వీరభద్రుడు

శ్రావణ సోమవారం సందర్భంగా తాండూరు భావిగి భద్రేశ్వర దేవాలయంలోని స్వామివారు.. ఏపీ రాష్ట్రం అన్నమయ్య జిల్లా రాయచోటి వీరభద్రేశ్వర స్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు చంద్రశేఖర్‌స్వామి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకొని నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

– న్యూస్‌టుడే, తాండూరు పట్టణం

ప్రాణం.. గాల్లో దీపం..



తాండూరు నుంచి సంగారెడ్డి వైపు వెళ్లే ప్రధాన రోడ్డు మధ్యలో పెద్దేముల్ మండలం గాజీపూరు వాగుపై వంతెన నిర్మించి 2023లో ప్రారంభించారు. దానికి ఇరువైపులా అనుసంధానిస్తూ మట్టి రోడ్డు సైతం వేశారు. అక్కడ రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. సంగారెడ్డి, కోట్‌పల్లి, జహీరాబాద్, బంట్వారం, వికారాబాద్ వైపు ఆర్టీసీ బస్సులు ఇదే రోడ్డుపై నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. బస్సుల్లో ఎప్పుడూ 40- 50 మంది వకు ప్రయాణిస్తుంటారు. ఇతర వాహనాలు పెద్ద సంఖ్యలో తిరుగుతుంటాయి. వర్షానికి కొన్నిచోట్ల రోడ్డు కొనలు కోసుకుపోయాయి. మట్టి కిందికి జారిపోయింది. వాహనాలు ఏమాత్రం అదుపు తప్పినా ప్రమాదం చోటుచేసుకుంటుంది.

– న్యూస్‌టుడే, తాండూరు

మిల్లర్లు మింగేశారు!

- రూ.కోట్లలో అక్రమాలు
- కేసులతోనే సరిపెడుతున్న అధికారులు

ఈనాడు, వికారాబాద్

జిల్లావ్యాప్తంగా మిల్లర్లు సర్కారుకు రూ. 102 కోట్ల మేర బకాయిపడ్డారు. అందులో రెండు, మూడు మండలాలకు చెందిన వారు ఏకంగా రూ. 15-25 కోట్ల మేర పెండింగ్‌లో పెట్టారు. అధికారులు మాత్రం తూతూమంత్రంగానే చర్యలు తీసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తీవ్ర చర్యలు తీసుకోవాలని, వీలైతే ఆర్‌ఆర్(రెవెన్యూ రికవరీ) చట్టాలు అమలు చేయాలని సర్కారు చెబుతున్నా.. జిల్లాలో మాత్రం తాఖీదులిస్తూ.. చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో మూతపడిన ఓ మిల్లు

వసూళ్లలో కనిపించని వేగం..

వారం, పది రోజులుగా ప్రభుత్వ ఆదేశాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు రైస్‌మిల్లులపై దాడులు నిర్వహిస్తున్నాయి. పక్క జిల్లాలోని అధికారులు ఉరుకులు, పరుగులు పెడుతూ.. పదుల సంఖ్యలో మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చట్టంలో భాగంగా తాఖీదులిస్తున్నారు. ఇక్కడ మాత్రం రూ. 102 కోట్లకు శనివారం వరకు కేవలం రూ. 15.50 కోట్లు మాత్రమే సర్కారు ఖజానాలో జమ అయ్యాయి. సోమవారం నాటికి మరో రూ. 2 కోట్ల మేర వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ మొత్తంలో బకాయిపడిన బడా మిల్లర్లు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు అంటున్నారు. శనివారం కుల్కచర్ల, దోమ మండలాల్లో రూ. 3.80 కోట్లు మాత్రమే చెల్లించారు. సోమ, మంగళవారాల్లో భారీగా వసూలవుతాయని భావించినా.. అలాంటి అవకాశాల్లేవని తెలుస్తోంది. ఇప్పుడు ఏం చేయాలో అంతుచిక్కడం లేదని పౌరసరఫరాల శాఖ అధికారులు అంటున్నారు.

నిఘా: సర్కారు ఆదేశాల మేరకు చర్యలు..

సర్కారుకు బకాయి పడిన డబ్బులు సత్వరం చెల్లించాలని మిల్లర్లపై ఒత్తిడి తెస్తున్నాం. వారికి తాఖీదులు ఇస్తున్నాం. సర్కారు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటున్నాం. చాలా మంది దిగి వస్తున్నారు. వారికి ఇచ్చిన గడువులోగా మొత్తం డబ్బులు చెల్లిస్తారు.

– మోహనకృష్ణ, పౌరసరఫరాల శాఖ మేనేజరు

బొంరాస్‌పేటలో రూ.3.68 కోట్ల దుర్వినియోగం..

బొంరాస్‌పేట పరిధిలోని ఒక రైస్‌మిల్లు యజమాని రూ. 3.68 కోట్ల దుర్వినియోగానికి పాల్పడినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. ఆ యజమానిపై కేసులు నమోదు చేశారు. ఆయన 2021-22 యాసంగిలో, 2022-23 వానాకాలం, యాసంగిలో కలిపి 1,493 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దారి మళ్లించినట్లు విచారణలో గుర్తించారు. అధికారులు వెళ్లి అతడితో మాట్లాడగా.. చెల్లింపుల విషయంలో ఎలాంటి సమాధానం రాకపోవడంతో కేవలం కేసు పెట్టినట్లు సమాచారం. జిల్లాలోని వికారాబాద్, కుల్కచర్లలో ఉన్న పెద్ద మిల్లర్ల విషయంలో అధికారులు ఏం చేస్తారో చూడాలని పలువురు అంటున్నారు.

సరిపడా మందులున్నాయి.. ఆందోళన వద్దు..

- 'ఈనాడు' ఫోన్ ఇన్‌లో జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్

వికారాబాద్ కలెక్టరేట్, వికారాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నారని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్యాధికారి డా. సుధాకర్‌లాల్ తెలిపారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా దగ్గర్లోని ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాలని ఆయన సూచించారు. సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఫోన్ ఇన్' నిర్వహించగా.. ప్రజల సమస్యలు విని పరిష్కారాలు చూపారు.

? **సమస్య:** వికారాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి చికిత్స కోసం వెళితే ఆరు, ఏడు పరీక్షలు రాస్తున్నారు. కేంద్రం వద్దకెళితే మిషన్లు పనిచేయడం లేదని, సాయంత్రం వేళ ఎందుకు వస్తున్నారని కసురుకుంటున్నారు.– రత్నం, కడిచర్ల, మోమిన్‌పేట మండలం

✓ **డీఎంహెచ్‌వో:** ఈ విషయాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాను.

? మా అమ్మకు బీపీ అదుపులోకి రావడం లేదు. ఆసుపత్రిలో థైరాయిడ్‌కు మందులున్నాయా?
– ముజీబ్, మోత్కూర్, దోమ

✓ దోమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తి పరీక్షలు చేయించండి. బీపీ పరీక్ష ఒకేసారి కాకుండా ఉదయం, సాయంత్రం నాలుగు రోజుల పాటు చెక్ చేయించండి. వైద్యులు మందులిస్తారు. ఆసుపత్రిలో థైరాయిడ్‌కు మందులున్నాయి.

? జ్వరం వచ్చి ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం వెళితే రక్త పరీక్షలు చేసి నివేదిక రాత్రి, లేదంటే మరుసటి రోజు ఇస్తున్నారు.
– నరేశ్, పరిగి

✓ పరిగి ఆసుపత్రి మా పరిధిలో లేదు. వైద్య విధాన పరిషత్తు చూసుకుంటుంది. ఈ సమాచారాన్ని వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తా.

? దోమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కడుపునొప్పి, ఇతర అనారోగ్య సమస్యల పరిష్కారం కోసం వెళితే మాత్రల్లేవు అని చెబుతున్నారు.
– వెంకటేశ్వర్లు, దోమ

✓ వికారాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోండి. అక్కడ ప్రతి దానికి ప్రత్యేక వైద్య నిపుణులున్నారు.

? మా అమ్మ దగ్గుతో ఇబ్బంది పడుతోంది. ఆమె వయసు 50 ఏళ్ల వరకు ఉంటుంది. ఎన్ని మందులు వాడినా తగ్గడం లేదు.
– శంకర్, పాలెపల్లి, దోమ మండలం

✓ ముందుగా ఎక్స్‌రే తీయించండి. వికారాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అన్ని రకాల పరీక్షలు చేస్తారు. ఇంటి చుట్టూ పార్థీనియం మొక్కలుంటే వెంటనే తొలగించండి.

(మిగతా 7లో..)

ఇక్కడివి అక్కడ.. అక్కడివి ఇక్కడ..

- నూతన మూల్యాంకనంపై సంఘాల భిన్నాభిప్రాయాలు

న్యూస్‌టుడే, కొడంగల్ పట్టణం, కొడంగల్, దుద్యాల, దౌల్తాబాద్

ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థుల జవాబు పత్రాలను మూల్యాంకనం చేయడంలో పాఠశాల విద్యాశాఖ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు సొంత పాఠశాలల్లోని ఉపాధ్యాయులే జబాబు పత్రాలను దిద్ది మార్కులు కేటాయించేవారు. ఇకపై పదో తరగతి మాదిరిగానే ప్రక్రియ కొనసాగనుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 1- 9వ తరగతుల్లో ఎస్‌ఏ-1, ఎస్‌ఏ-2 పరీక్షలకు, 10వ తరగతిలో ఎస్‌ఏ-1కు ఎక్స్‌టర్నల్ మూల్యాకనం వర్తిస్తుంది. ఈ విద్యా సంవత్సరం నుంచే దీన్ని అమలు చేయనున్నారు.

ప్రాథమిక పాఠశాలలు	711
ప్రాథమికోన్నత	116
ఉన్నత పాఠశాలలు	176
కేజీబీవీలు	19
గురుకులాలు	23
మొత్తం విద్యార్థులు	82,689

నిర్ణీత షెడ్యూలు ప్రకారం పరీక్షలు..

పరీక్షలు నిర్ణీత షెడ్యూలు ప్రకారం ఆయా బడుల్లోనే జరుగుతాయి. సమాధాన పత్రాలను హెచ్‌ఎంలు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవోకు అప్పగిస్తారు. తరువాత వాటిని అదే మండలంలోని ఇతర బడుల ఉపాధ్యాయులు దిద్దుతారు. ఇందుకోసం ప్రతి మండలంలో ఒక మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేస్తారు. 3-5 రోజుల్లో వాల్యుయేషన్ నిర్వహించి మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఒక్కో ఎమ్మార్సీకి రూ. 10వేల చొప్పున మంజూరు చేయనున్నారు.

పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

హెచ్‌ఎంల బాధ్యతలు..

పరీక్షలు నిర్వహించడం, జవాబు పత్రాలు సేకరించడం, తరగతి, సబ్జెక్టుల వారీగా సమాధాన పత్రాలను వేరుచేయడం, జాగ్రత్తగా సీల్ వేసి ఎమ్మార్సీలో అప్పగించడం హెచ్‌ఎంలు చూసుకుంటారు. పాఠశాలల నుంచి వచ్చే సీల్డ్ కవర్లను స్వీకరించి వాటిని సరిచూసుకోవడం, రసీదు ఇవ్వడం, జాగ్రత్తగా భద్రపర్చడం, తరగతుల వారీగా మూల్యాంకనం చేసేవారిని నియమించడం వంటి పనులను ఎంఈవో చూసుకోవాలి. ప్రాథమిక, ప్రాథమికోన్నత బడులకు ఒకరు, ఉన్నత బడులకు ఒకరు చొప్పున వాల్యుయేషన్ కేంద్రాలకు ఇన్‌ఛార్జులుగా నియమిస్తారు. ఎస్‌ఏ-1 పరీక్షలు అక్టోబరులో, ఎస్‌ఏ-2 పరీక్షలు ఏప్రిల్‌లో జరుగుతాయి. ఈ విధానంపై ఉపాధ్యాయ సంఘాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజావాణిలో 110 దరఖాస్తులు స్వీకరించామని అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వెంకటాచారితో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . ప్రతి అర్జీని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పింఛన్లు, భూసమస్యలు, ఇందిరమ్మ గృహాలు, పంచాయతీలకు సంబంధించిన వినతులు వచ్చాయని తెలిపారు. సమావేశంలో డీఆర్వో స్వర్ణలత, జడ్పీ సీఈవో సుధీర్, డీఆర్డీవో శ్రీనివాస్, జిల్లా అధికారులు కవిత, మాధవరెడ్డి, జయసుధ, సదానందం, జైపాల్‌రెడ్డి, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సిద్ధం

వికారాబాద్, న్యూస్‌టుడే: ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసుశాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఏఎస్పీ రాజేష్‌మీనా తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పలు సమస్యలపై 12 ఫిర్యాదులు స్వీకరించారు. బాధితుల సమస్యలను ఓపికగా విని, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను కంప్యూటర్‌లో నమోదు చేసి పురోగతిని పర్యవేక్షిస్తామన్నారు.

మనీ తగ్గింది.. మెనూ మారింది!

- సిద్దిపేటకు చెందిన రాజు కుటుంబంలో మొత్తం నలుగురు సభ్యులు. ఓ దుకాణంలో పని చేస్తుండగా.. నెలకు రూ. 12 వేల వరకు వేతనం పొందుతున్నారు. ఆ మొత్తం నుంచే నిత్యావసరాల కొనుగోలు సహా ఇద్దరు పిల్లల చదువుకు వెచ్చించాల్సిన పరిస్థితి. దాదాపు తొమ్మిది నెలల కింద వరకు ప్రణాళికతో నెట్టుకొచ్చారు. కొన్నాళ్లుగా నిత్యావసరాల ధరలు పెరిగిన పరిస్థితుల్లో నెల బడ్జెట్‌కు అదనంగా రూ. 3 వేలు అవసరమవుతున్నాయి. వారానికోసారి తినే మాంసాన్ని 15 రోజులకోసారి తింటుతున్నారు.

పెరిగిన నిత్యావసరాల ధరలతో వంటింట సంక్షోభం

న్యూస్‌టుడే, సిద్దిపేట, ధూల్మిట్ట, మెదక్, సంగారెడ్డి అర్బన్, వికారాబాద్ కలెక్టరేట్, దుద్యాల

రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసరాల ధరలు సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో వణుకు పుట్టిస్తున్నాయి. ప్రతి నెలా బడ్జెట్ లెక్కలు మారుతున్న తీరు బడుగు జీవులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఖర్చులు తగ్గించుకునేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. వినోదాలు, యాత్రలను వాయిదా వేస్తున్నారు. ఉన్నంతలో సర్దుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు.

సాగు జీవనాధారం..

సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో మెజార్టీ శాతం జనాభాకు వ్యవసాయమే ప్రధాన వృత్తి. పేద, మధ్య తరగతి కుటుంబాల శాతం ఎక్కువే. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తక్కువ. పంట ఉత్పత్తులపై జీవించే వారు అనేకం. ఎల్‌నినో పరిస్థితుల్లో సాగు రంగం ఆశాజనకంగా లేదు. ఆశించిన మేర సీజన్ లేని పరిస్థితుల్లో పలువురు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఇదే క్రమంలో పెరుగుతున్న ధరలు ఒకింత తలనొప్పిగా మారాయి. వివిధ రకాల ధరల పెంపుతో అల్పాహారం, భోజనం, చిరుతిళ్లు, ప్రైవేటు వాహనాల ఛార్జీల్లో పెరుగుదల స్పష్టమవుతోంది.

నాలుగు జిల్లాల వివరాలు లక్షల్లో..

జిల్లా	జనాభా	కుటుంబాలు	గ్యాస్ వినియోగదారులు	వాహనాలు
సిద్దిపేట	10.12	2.50	3.31	3.87
మెదక్	7.67	2.19	2.35	1.33
సంగారెడ్డి	15.27	4.10	6.10	3.67
వికారాబాద్	12.50	1.97	2.08	2.08

రూ.2 నుంచి రూ.3 వేలు అదనంగా..

దాదాపు తొమ్మిది నెలల్లో నిత్యవసరాల ధరలు 20 నుంచి 40 శాతం వరకు పెరిగినట్లు స్పష్టమవుతోంది. పేద, మధ్య తరగతి కుటుంబాలపై సగటున రూ. 2 వేల నుంచి రూ. 3 వేలు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. మాంసం, కూరగాయల ధరల్లోనూ వ్యత్యాసం కనిపిస్తోంది. దీంతో పలువురు ఖర్చులు తగ్గించేందుకు దృష్టి సారించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలు, దినసరి వేతనంపై పని చేసే వారు తర్జనభర్జనకు గురవుతున్నారు.

ధరల్లో మార్పు ఇలా.. (కిలో.. రూ..లలో)

విభాగం	9 నెలల క్రితం	ప్రస్తుతం
వంటగ్యాస్	923.50	1012.50
కారం	300	420
వంట నూనె	148	180
కందిపప్పు	120	135
పాలు(లీటరు)	80	84
చక్కెర	44	60
పెట్రోల్ (లీటరు)	107.71	115.94
డీజిల్ (లీటరు)	95.93	104.05
మటన్ (కిలో)	800	900
కోడిగుడ్లు (30)	150	189

ప్రాధాన్య క్రమం చూడాలి..

ధరలు పెరగడానికి అనేక కారణాలు ఉంటాయి. అవసరం, కోరిక మధ్య తేడాను గుర్తించాలి. ఇంట్లో అందరూ పొదుపును అలవర్చుకోవాలి. వృథా ప్రయాణాలు, వాహన వినియోగం తగ్గించుకోవాలి. కొన్ని వాడకాల్లో మెలకువలు పాటించాలి. ప్రాధాన్య క్రమంలో జాబితాలు రూపొందించుకొని అనుసరించాలి. ఇదే క్రమంలో ఆరోగ్యం, అత్యవసర అంశాల్లో వెనకడుగు వేయొద్దు. ఆదాయం పెరిగే పరిస్థితులు లేని దృష్ట్యా ఖర్చులు తగ్గించుకోవాలి. చిన్నపాటి పెట్టుబడుల ద్వారా ఆర్థిక వృద్ధి సాధించవచ్చు.

–ప్రొఫెసర్ కె.భవాని, ఆర్థిక విశ్లేషకురాలు, దుబ్బాక

పేదలకు పూట గడిచేదెట్లా?.. – అనిత, వ్యవసాయ కూలీ, దుద్యాల

కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నాం. నిత్యావసర ధరలు ఆకాశన్నంటుతుండడంతో పేదలు ఎలా బతకాలి.. నూనెలు, చక్కెర, సిలిండర్ ధరలు అంతకంతకూ పెరుగుతుండటంతో కొనడం కష్టంగా మారింది. వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ పనులూ అరకొరగానే సాగుతున్నాయి. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలి.

పాఠశాలల్లో ఆటల సందడి

- నేటి నుంచి ఎస్‌జీఎఫ్ పోటీలు

న్యూస్‌టుడే, బొంరాస్‌పేట

విద్యార్థి దశ నుంచే బాలబాలికలు క్రీడలపై దృష్టి సారించేందుకు ప్రభుత్వం ఏటా ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) పోటీలు నిర్వహిస్తోంది. ఈ ఏడాదికి సంబంధించిన పోటీలు జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించడం, ప్రతిభావంతులను రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయడం ఈ పోటీల ముఖ్య ఉద్దేశం.

మూడంచెల పద్ధతిలో..

ఆటల పోటీలను జోనల్, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో మూడంచెల పద్ధతిలో నిర్వహిస్తారు. అండర్-14, 17 ఏళ్ల బాలబాలికల విభాగంలో పాఠశాల విద్యార్థులకు, 19 ఏళ్లలోపు కళాశాలల వారికి పోటీలుంటాయి. ఇందుకోసం జిల్లాను కొడంగల్, పరిగి, వికారాబాద్, తాండూరు, మోమిన్‌పేట, పెద్దేముల్ జోన్లుగా విభజించారు. ఒక్కో జోన్‌కు ఆరుగురు కార్యదర్శులను ఎన్నుకున్నారు. ముందుగా అన్ని మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు. ఇందులో మంచి ప్రతిభ చూపిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడినుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఒక్కో క్రీడాంశంలో ఒక జట్టును ఎంపిక చేస్తారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై క్రీడల్లో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందిస్తారు. వీటితో విద్య, ఉద్యోగ పోటీ పరీక్షల్లో క్రీడా కోటా కింద 2 శాతం రిజర్వేషన్ సదుపాయం ఉంటుంది.

జిల్లాలో ఉన్నత పాఠశాలలు:	176
కేజీబీవీలు	19
ఆదర్శ పాఠశాలలు	9
ప్రైవేటు పాఠశాలలు	210
మొత్తం విద్యార్థులు	48,758

అంశాలివే..

అండర్- 14, 17 బాలబాలికలు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్, ఖోఖో, తైక్వాండో, కరాటే, బాస్కెట్‌బాల్, షటిల్, టేబుల్ టెన్నిస్, చదరంగం, అథ్లెటిక్స్‌లలో పోటీలు నిర్వహిస్తారు. జోనల్ పోటీలను సెప్టెంబరు 15లోపు, జిల్లాస్థాయివి 25లోపు పూర్తి చేయాలి. ఆ తరువాత రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభమవుతాయి. 14 ఏళ్లలోపు వారు 2013 సెప్టెంబరు 1 తరువాత, 17 ఏళ్లలోపు వారు 2010 సెప్టెంబరు 1 తరువాత జన్మించిన వారై ఉండాలి.

విజయవంతం చేయాలి..

ఎస్‌జీఎఫ్ పోటీలను సోమవారం నుంచి ప్రారంభిస్తున్నాం. జిల్లాలోని ఆరు జోన్ల పరిధిలోని అన్ని మండలాల్లో ఆటల పోటీలు నిర్వహించేలా ఆయా జోన్ల కార్యదర్శులకు సూచించారు. అనంతరం జిల్లాస్థాయి పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయికి క్రీడాకారును ఎంపిక చేస్తాం.

– మహ్మద్ ఖాజా, ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి

ప్రగతి చక్రం.. ఆర్థికాభివృద్ధికి ఊతం

- ఆర్టీసీకి అద్దెకిచ్చిన 19 బస్సులు

న్యూస్‌టుడే, పరిగి, వికారాబాద్ కలెక్టరేట్

మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఒక్కో సంఘానికి రూ. 10 లక్షల మేరకు వడ్డీలేని రుణాలిచ్చి ప్రగతి పథం వైపు పయనించేలా చేస్తోంది. ఇందులో భాగంగా మండల సమాఖ్యల ద్వారా బస్సులు కొనిపించి ప్రతినెలా వారికి ఆదాయం అందేలా చర్యలు చేపట్టింది.

ఒక్కో దానికి రూ.36 లక్షలు..

ఒక్కో బస్సు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 30 లక్షలను రుణంగా ఇవ్వగా.. సమాఖ్యలు రూ. 6 లక్షలు జమచేసి కొన్నాయి. పరిగి ఆర్టీసీ డిపోనకు 5, వికారాబాద్‌కు 2 బస్సులను సమాఖ్య ప్రతినిధులు అప్పగించారు. మండల సమాఖ్యకు నెలకు ఒక బస్సుకు ఆర్టీసీ సంస్థ వారు రూ. 69,468 అద్దె చెల్లిస్తున్నారు. చెల్లించిన అద్దెను సమాఖ్య ఖాతాల్లో జమచేస్తున్నారు.

మండలాలు	20
మండల సమాఖ్యలు	19
గ్రామ సమాఖ్యలు	658
పొదుపు సంఘాలు	16,870
నమోదైన సభ్యులు	1.68 లక్షలు
కొన్న బస్సులు	19
చేసిన వ్యయం	రూ.6.84 కోట్లు
ఆర్నెల్లకు వచ్చిన ఆదాయం	రూ.80 లక్షలు

అద్దె ఒప్పందం ఏడేళ్లు..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తూ ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించింది. దీంతో ఆర్టీసీకి ప్రయాణికుల రద్దీ దాదాపు రెండింతలైంది. ఈ నేపథ్యంలో తగినన్ని బస్సులు ఉండాలన్న ఉద్దేశంతో సమాఖ్యల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కొనిపించి ఆర్టీసీకి అప్పగించింది. ఈ బస్సులను ఏడేళ్లపాటు ఆర్టీసీ డిపోల్లో నడిపేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.

పెట్రోల్ పంపు ఏర్పాటుకు కృషి..

బస్సుతో ప్రతినెలా సమాఖ్య ఖాతాలో రూ. 70వేలు జమ అవుతున్నాయి. ఇదే గాకుండా పెట్రోల్ పంపును ఏర్పాటు చేయాలని అధికారులను కోరడంతో నస్కల్ రోడ్డులో స్థలం చూపారు. అది ఆమోదయోగ్యంగా లేకపోవడంతో హైదరాబాద్- బీజాపూర్ రోడ్డుపై చూపాలని కోరాం.

– ఎం.శ్వేత, పరిగి మండల సమాఖ్య అధ్యక్షురాలు

అన్ని విధాలా సహకారం..

స్థానిక పరిస్థితులు, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని సంఘాలు యూనిట్ల ఏర్పాటుకు ముందుకొస్తే అన్ని విధాలా సహకారం అందిస్తాం. రూ. 6 కోట్ల వ్యయంతో కోట్‌పల్లి, బార్వాద్‌లో 8 ఎకరాల్లో రెండు సౌర విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేశాం. సీఎం చేతుల మీదుగా త్వరలోనే ప్రారంభిస్తాం.

– కె.నర్సిములు, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

4న జిల్లాకు ముఖ్యమంత్రి రాక

మద్దూరు, కొడంగల్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 4న వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంతోపాటు నారాయణపేట జిల్లా మద్దూరులో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వంచర్ల బాలయ్య ఓ ప్రకటనలో తెలిపారు. మద్దూరులో వివిధ అభివృద్ధి పనులను సీఎం స్వయంగా పరిశీలించనున్నట్లు తెలిపారు. అనంతరం వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్‌లో పర్యటిస్తారన్నారు. బొంరాస్‌పేట మండలం పోలేపల్లిలో, కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తారన్నారు.

తాండూరు సబ్ కలెక్టర్‌గా కె.ప్రణయ్‌కుమార్

తాండూరు, న్యూస్‌టుడే: తాండూరు సబ్ కలెక్టర్‌గా కె.ప్రణయ్ కుమార్ నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2024 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయనకు శిక్షణ పూర్తి కావడంతో తాండూరు సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు.

హైదరాబాద్‌కు చేరిన మానసరోవర్ యాత్రికులు

హైదరాబాద్: సుందరదాస్ ఎంఎస్ రామారావు మెమోరియల్ ట్రస్టు ఛైర్మన్ పి.శ్రీనివాస్‌స్వామి ఆధ్వర్యంలో 34వ కైలాస మానసరోవర్ వెళ్లిన 31 మంది సభ్యుల బృందం సోమవారం క్షేమంగా నగరానికి చేరుకున్నారు. శ్రీనివాస్‌స్వామి చిక్కడపల్లిలో మాట్లాడారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9000766012
9963522257
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008001735

(c) eenadu

మహిళా క్రికెటర్లకు మంచి భవిష్యత్తు

• గ్రామీణ ప్రాంతాలకు వచ్చి ప్రతిభ వెలికితీస్తాం • 'న్యూస్‌టుడే'తో తెలంగాణ క్రికెట్ ఆపరేషన్ కమిటీ సభ్యురాలు సునీత ఆనంద్

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ: మహిళా క్రికెట్‌కు కొన్ని సంవత్సరాలుగా ఆదరణ పెరుగుతోంది. 2025లో వరల్డ్ కప్ సాధించిన తరువాత యువతులు క్రికెట్ నేర్చుకోవడానికి ముందుకొస్తున్నారు. స్మృతి మంధానా.. హర్మన్‌ప్రీత్ కౌర్, షెఫాలివర్మ, దీప్తిశర్మ వంటి క్రికెటర్లను స్ఫూర్తిగా తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు హైదరాబాద్‌లోనే నిర్వహించే మహిళా క్రికెట్ ఎంపికలు మొదటి సారిగా ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి సంగారెడ్డిలో సోమవారం నిర్వహించారు. భారత మాజీ క్రికెటర్, తెలంగాణ క్రికెట్ ఆపరేషన్ కమిటీ సభ్యురాలు సునీత ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమెతో 'న్యూస్‌టుడే' ముఖాముఖి మాట్లాడింది. కార్యాచరణ ఆమె మాటల్లోనే..

హెచ్‌సీఏ ప్రత్యేక చర్యలు

గ్రామాల్లోనే ప్రతిభావంతులైన మహిళా క్రాకెటర్లు ఉన్నారు. సరైన సదుపాయాలు, ప్రోత్సాహం లేక వెనుకబడుతున్నారు. వారిని గుర్తించేందుకు హెచ్‌సీఏ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోంది. ప్రతిభ ఉన్న వారిని ప్రోత్సహిస్తాం. ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తాం.

మొదటి సారిగా జిల్లాల్లో..

హైదరాబాద్‌లోనే పరిమితమైన ఎంపికలను మొదటి సారిగా ఈ జిల్లాలో చేపడుతున్నాం. మేమే గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి అక్కడి పరిసరాలు, పరిశీలిస్తాం. స్థానికంగానే నేర్పిస్తాం. అవసరాలను సమకూరుస్తాం.

లీగ్ మ్యాచ్‌లతో తేల్చుతాం

గతంలో కేవలం ఓపెన్ సెలక్షన్స్ మాత్రమే జరిగేవి. ఆ సమయంలో ఆడలేని వారు వెనుకబడతారు. లీగ్ మ్యాచ్‌లు నిర్వహించి ఎంపికలు చేస్తాం. ప్రతిభ ఉన్న గ్రామీణుల ప్రతిభ వెల్లడవుతుంది.

సునీత ఆనంద్

ముఖాముఖి

రోజూ 4 గంటల సాధన

జాతీయ స్థాయి క్రికెట్ వరకు రావాలంటే నిత్యం సాధన ఉదయం, సాయంత్రం 4 గంటల సాధన అవసరం. అనుభజ్ఞులైన శిక్షకుల సహాయం తీసుకోవాలి. కఠినంగా ప్రాక్టీస్ చేస్తేనే ముందంజ వేయగలుగుతారు. జిల్లాల్లో ఇండోర్ మైదానాలు, వసతులు, కోచ్‌ల నియామకానికి చర్యలు తీసుకుంటాం.

ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన మహిళా క్రికెటర్లకు సూచనలు ఇస్తున్న తెలంగాణ క్రికెట్ ఆపరేషన్ కమిటీ సభ్యురాలు సునీత ఆనంద్

గల్లీ గల్లీ.. శబ్దాల లొల్లి!

• ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్ల మార్పు

భారత మోటారు వాహనాల చట్టం ప్రకారం శబ్దం 75-80 డెసిబుల్స్

ద్విచక్ర వాహనదారులు వేసిన సైలెన్సర్ల శబ్దం 100-120 డెసిబుల్స్

సిద్దిపేట పోలీసులు స్వాధీనం చేసుకున్న సైలెన్సర్లు

జిల్లా	మొత్తం వాహనాలు	ద్విచక్ర వాహనాలు
వికారాబాద్	1,48,285	56,627
సంగారెడ్డి	3,67,948	2,34,246
మెదక్	1,42,693	61,140
సిద్దిపేట	3,87,407	2,61,438

న్యూస్‌టుడే, తాండూరు గ్రామీణ, సంగారెడ్డి అర్బన్, సిద్దిపేట:

వాహనదారుల్లో కొందరి సరదా మరికొందరి ప్రాణాల మీదకు తెస్తోంది. ద్విచక్ర వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లను అమర్చుతున్నారు. భారీ శబ్దం, గాలి కాలుష్యంతో హడలెత్తిస్తున్నారు. ఉన్నత విద్య, ఉపాధి, ఉద్యోగాలకు వెళ్లే వారంతా ద్విచక్ర వాహనాలను వినియోగిస్తున్నారు. వీరిలో మహిళలు సైతం ఉంటున్నారు. ద్విచక్ర వాహనాలను తోలడం సాధారణంగా మారింది. ప్రధానంగా బుల్లెట్ ప్రియులు పాతతరం భారీ శబ్దం టపాసుల పేలుడు మాదిరి వచ్చే సైలెన్సర్లను అమర్చుతున్నారు. వేగంతో కూడిన శబ్ద తీవ్రత చుట్టుపక్కల వారికి ప్రమాదకరంగా ఉంటోంది.

ఇబ్బందులు ఇలా..

• భారీ శబ్దంతో రాకపోకల సమయంలో స్థానికులు, తోటి వాహనదారులు ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదముంది.

• వెల్డింగ్, వడ్రంగి, చెరుకు బండి వంటి వాటిలో ఆకస్మిక పెద్దశబ్దానికి ఏకాగ్రత కోల్పోయి గాయాల పాలవుతున్నారు.

• బాలలు, వృద్ధులు, గర్భిణులకు ఆందోళన పెరుగుతుంది.

• రక్తపోటు పెరుగుతుంది.

• చెవులు దెబ్బతిని వినికిడి లోపం వస్తుంది.

• మానసిక ఒత్తిడికి గురవుతారు.

చలానాలు విధిస్తారని.. పోలీసుల కన్నుగప్పి..

పోలీసులు ప్రధాన రహదారులు, కూడళ్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా కొన్నిసార్లు పట్టుబడుతున్నారు. వారికి రూ.5 వేల నుంచి రూ.10 వేల చలానా విధిస్తున్నారు. కొందరివి జప్తు చేశారు. గతంలో ముప్పై వాహనాలవి తొలగించి ధ్వంసం చేశారు. సిద్దిపేటలోనూ పోలీసు కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆధ్వర్యంలో పది రోజుల క్రితం 240 సైలెన్సర్లు తీయించి రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేయించారు. ఇంకా చాలాచోట్ల వాహనదారులు కొందరు వినియోగిస్తూ ప్రజలను హడలగొడుతున్నారు.

ఎనిమిది దిక్కులా వసతుల వ్యథ

• పరిగి మున్సిపాలిటీకి 8 ఏళ్లయినా వెనుకబాటే

పరిగి, న్యూస్‌టుడే: ఒక పట్టణం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే ఎనిమిదేళ్లు చాలదా? ఇదే ప్రశ్న పరిగి మున్సిపాలిటీ ప్రజలకు వచ్చింది. గ్రామ పంచాయతీగా ఉన్న పరిగి.. 2018లో పురపాలికగా మారింది. పట్టణ పోకడలు ఇంకా అనేకచోట్ల రానేలేదు. ముఖ్యంగా స్వచ్ఛత, మార్కెట్ తదితర అంశాల్లో జనం ఇబ్బంది పడుతున్నారు. పక్కా ప్రణాళిక లేకపోవడం, మౌలిక సదుపాయాల కల్పనలో వెనుకబడింది.

శిథిలావస్థలో మురుగు కాల్వలు

వృథాగా స్వీపింగ్ యంత్రం

పట్టణంలో పారిశుద్ధ్య వ్యవస్థ గాడి తప్పింది. పురపాలికలో కొత్తగా ఐదు పంచాయతీల విలీనంతో పరిధి మరింత పెరిగింది. దశాబ్దాల క్రితం నిర్మించిన మురుగు కాల్వలు శిథిలావస్థకు చేరాయి. మురుగు సాఫీగా ముందుకు సాగడం లేదు. ఎక్కడికక్కడ నిలిచి దోమలు, ఈగల బాధ పెరిగింది. వీధులు సైతం పరిశుభ్రంగా కనిపించడం లేదు. రూ.24 లక్షల వ్యయంతో రెండేళ్ల క్రితం కొనుగోలు చేసిన ఊడ్చే యంత్రం నిర్వహణ కొరవడి వృథాగా పడి ఉంది.

• నివాస గృహాలు: 7,033

మున్సిపాలిటీ:
పరిగి (2018 నుంచి)
పట్టణ విస్తీర్ణం: 53.82 చ.కి.మీ.
వార్డులు: 18
కాలనీలు: 40
జనాభా: 30,000

డంపింగ్ యార్డు లేక పారబోత

నిత్యం పట్టణంలో భారీగా వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. డంపింగ్ యార్డు లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ పారబోయాల్సి వస్తోంది. పరిసర వాసులకు దుర్వాసనతో పాటు వాతావరణ పరిస్థితులు కలుషితమవుతున్నాయి. రెండెకరాల్లో మండలంలోని రంగాపూర్ శివారులో స్థల పరిశీలన చేసిన ఇంకా కార్యరూపం దాలలేదు.

• రోజూ వెలువడుతున్న వ్యర్థాలు: 15 టన్నులు

రోడ్ల వెంబడి అమ్ముకునే పరిస్థితి

అసంపూర్తిగా సమీకృత భవనం

పురపాలికగా మారి జనాభా సైతం పెరగడంతో కూరగాయల క్రయవిక్రయాలు ఊపందుకున్నాయి. పరిసర గ్రామాలకు చెందిన వారు పరిగికి వచ్చి అమ్ముకుంటున్నారు. ప్రత్యేక స్థలం ఉన్నా వసతుల లేమితో రోడ్ల వెంబడి అమ్ముతున్నారు. రూ.4 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన సమీకృత మార్కెట్ ఐదేళ్లుగా అసంపూర్తిగా ఉంది. ఇది పూర్తయితే వందలాది మందికి ఉపాధి అవకాశాలతో పాటు ఇబ్బందులు తీరుతాయి.

• రోజూ విక్రయించే కూరగాయలు: 7 టన్నులు

అర్హుల ఓట్లు తొలగిపోకుండా జాగ్రత్తపడాలి: వెన్నెల

దుబ్బాకలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్ వెన్నెల

దుబ్బాక, న్యూస్‌టుడే: సర్ ప్రక్రియలో భాగంగా రూపొందించిన ముసాయిదా జాబితాలో పేర్లు గల్లంతైన ఓటర్లకు తిరిగి ఓటుహక్కు కల్పించేలా పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్, సర్ పార్లమెంటరీ ఇన్‌ఛార్జి డా.జి. వెన్నెల అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో 'సర్' ఫేజ్-2పై బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనామలీస్ ఓటర్లకు సంబంధించి నోటీసులు అందుకుంటున్న వారి సందేహాల నివృత్తికి పార్టీ నాయకులు సహకరించాలన్నారు. ప్రతి బూత్‌లో బీఎల్ఏలు సమన్వయంతో పని చేసి, అర్హుల ఓట్లు తొలగిపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో దుబ్బాక, తొగుట ఏఎంసీ ఛైర్మన్లు కొంగర రవి, చెరుకు విజయ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మద్దుల గాల్‌రెడ్డి, పార్టీ బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

కేతకి సంగమేశ్వరుడికి రుద్రాభిషేకం

ఝరాసంగం, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం కేతకి ఆలయానికి శ్రావణ మాసం మూడో సోమవారం భక్తులు భారీగా తరలివచ్చి సంగమేశ్వరుడిని దర్శించుకున్నారు. స్వామివారికి పంచామృతంతో రుద్రాభిషేకాలు, బిల్వార్చన, మంగళహారతి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న అమృత గుండంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. మహారాష్ట్రలోని అహ్మదాపూర్‌కు చెందిన వెయ్యి మంది భక్తులు పాదయాత్రగా వచ్చిన మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో శివరుద్రప్ప, సీఐ హన్మంతు, ఎస్సై పాటిల్ క్రాంతికుమార్ పర్యవేక్షించారు.

ఉమ్మడి జిల్లా మహిళా క్రికెట్ జట్టు ఎంపిక

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా సంఘం సహకారంతో మహిళా క్రికెట్ జట్టు ఎంపిక సోమవారం సంగారెడ్డిలోని ఎంఎస్ అకాడమీలో నిర్వహించారు. తెలంగాణ మహిళా క్రికెట్ అసోసియేషన్ కమిటీ సభ్యురాలు సునీత ఆనంద్ పర్యవేక్షణలో ఎంపికలు జరిగాయి. ఉమ్మడి జిల్లా నుంచి 38 మంది పాల్గొనగా.. ప్రతిభ చూపిన వారి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఆమె చెప్పారు. సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాజేందర్ రెడ్డి, కోచ్‌లు శ్రీనాథ్‌రెడ్డి, ఖలీముద్దీన్, మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసై యువకుడి బలవన్మరణం

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: వ్యసనాలకు బానిసై ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లా వీరారెడ్డిపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన **కానుగంటి నర్సింలు** (33) వ్యవసాయం చేస్తుంటాడు. వ్యసనాలకు బానిసై అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చలేక పొలంలో ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అల్లం సాగు.. తెగుళ్ల నివారణతో బాగు

రైతుకు మెలకువలు చెబుతున్న వ్యవసాయ అధికారి

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్: అల్లం సాగులో మెలకువలు పాటిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని సంగారెడ్డి జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి పండరి సూచించారు. తెగుళ్లను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోతే నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అల్లంసాగులో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

బ్యాక్టీరియా వడలు తెగులు: ఈ తెగులు ప్రస్తుతం ఎక్కువగా ఆశిస్తోంది. తెగులు సోకిన ఆకుల అంచులు ఇత్తడిరంగుకు మారడంతో పాటు వెనకకు ముడుచుకుపోతాయి. క్రమంగా మొక్క వడలి ఎండిపోతుంది. భూమికి దగ్గరలోని కాండాన్ని పరిశీలిస్తే చెడు వాసన వస్తుంది. నివారణకు స్ట్రెప్టోసైక్లిన్ 20 గ్రా./ 100 లీటర్ల నీటికి కలిపి మొక్క వేర్ల వద్ద పిచికారీ చేయాలి.

దుంపకుళ్లు తెగులు: ఈ తెగులు ముఖ్యంగా నీరు నిల్వ ఉండే నేలల్లో కనిపిస్తుంది. ఆకులు పసుపు రంగులోకి మారుతాయి. తెగులు సోకని పొలం నుంచి విత్తనం ఎంచుకోవాలి. పొలంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలి. తెగులు లక్షణాలు కనిపిస్తే ట్రైకోడెర్మావిరిడి 10 గ్రా./ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 2 గ్రా./ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

పొలుసు పురుగు: విత్తన దుంపలను ఆశించి రసం పీల్చుతాయి. విత్తన దుంపలను లీటరు నీటికి 5 మి.లీ. చొప్పున మలాథియాన్ కలిపిన ద్రావణంలో 30 నిమిషాలు నానబెట్టాలి. విత్తనం ఆరబెట్టాక విత్తుకుంటే పురుగు నివారించవచ్చు.

వేరుపురుగు: దుంపల మొదళ్లలో వేర్లను కత్తిరిస్తుంది. నష్టం గమనించగానే ఫోరేట్ గుళికలు 5 కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ గుళికలు ఎకరానికి ఏడు కిలోలు వేయాలి.

మొవ్వుతొలుచు పురుగు: ఈ పురుగు మొవ్వును తొలచడం వల్ల మధ్య కొమ్మ చనిపోతుంది. నివారణకు లీ. నీటికి డైమిథోయేట్ 2 మి.లీ.+సాండోవిట్ 1 మి.లీ./లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఫిల్లోస్టికా ఆకుమచ్చ తెగులు: ఈ తెగులును ఆకులపై జులై నుంచి అక్టోబరు మాసాల్లో గమనిస్తాం. ప్రారంభదశలో ఆకులపై అండాకారంలో ఉండి నీటిని పీల్చుకున్నట్లుగా మచ్చలు ఏర్పడతాయి. ఆకులు పెళుసుగా మారతాయి. నల్లటి మచ్చలు ఆకుల ఉపరితలంపై ఏర్పడి ఎండిపోతాయి. ఆక్సీక్లోరైడ్ గల శిలీంద్రనాశిని(బ్లైటాక్స్) మందును 3గ్రా./లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

రైతేరాజు

సాగులో సందేహాలా?

సంప్రదించాల్సిన ఫోన్ నంబరు
9963164507

న్యూస్‌టుడే, చేర్యాల:

ప్రశ్న: వేరుసెనగలో జిప్సం ఎంత మోతాదులో వేయాలి? – యాదగిరి, రైతు, తాండూరు

సమాధానం: నీటి పారుదల ఉన్న ప్రాంతాల్లో ఎకరానికి 200 కిలోల జిప్సం తొలిపూత సమయంలో వేసుకుంటే నూనెగింజ పంటల్లో అధిక దిగుబడులు పొందవచ్చు.

ప్రశ్న: మిశ్రమ ఎరువులతో కలిపి జింక్ వేసుకోవచ్చా? – బాలకిషన్, దుబ్బాక

సమాధానం: భాస్వరం, జింక్ ఎరువులను ఎప్పుడూ కలిపి వేయకూడదు. వీటి మధ్య వ్యతిరేక చర్యల వల్ల వేసిన జింక్ లభ్యత తగ్గడం లేదా పూర్తిగా అందకపోవచ్చు. భాస్వరం ఎరువు వేసిన మూడు, నాలుగు రోజుల తర్వాత జింక్ ఎరువు వేసుకోవాలి.

చందుపట్ల పల్లవి, శాస్త్రవేత్త (తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం - సిద్దిపేట)

కంది, పత్తిలో కలుపుంటే..

కంది, పత్తి పైర్లకు అవసరం మేరకే నీరందేలా చూడాలి. అంతర కృషి ద్వారా ఎప్పటికప్పుడు కలుపు తొలగించాలి. నీటిఎద్దడి వల్ల మొక్కకు సరైన మోతాదులో పోషకాలు అందక ఎదుగుదల ఆగిపోయే ప్రమాదముంది. అందుకు 2 శాతం యూరియా ద్రావణం లేదా రెండు శాతం డీఏపీ లేదా 5 శాతం 19.19.19 ద్రావణాన్ని మొక్కలపై పిచికారీ చేయాలి. – న్యూస్‌టుడే, చేర్యాల

మీకు తెలుసా..?

పంటల సాగుకు రైతులు బిందు సేద్యం పద్ధతి పాటిస్తే 40 శాతానికి పైగా నీరు ఆదా అవుతుంది. దీంతోపాటు 15-40 శాతం ఎరువులు, 20-30 శాతం రసాయనాలు, 10-15 శాతం కూలీల అవసరం తగ్గి 30-70 శాతం దిగుబడులు పెరిగి భారీగా లాభం పొందుతారు.
– న్యూస్‌టుడే, చేర్యాల

పూల తోట.. లాభాల బాట

ఆదర్శంగా నిలుస్తున్న మహిళా రైతు

సరవ్వ

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: పూల సాగు చేపట్టిన ఓ మహిళా రైతు అందరికీ ఆదర్శంగా నిలుస్తూ.. రోజువారీ ఆదాయంతో లాభాల బాటలో పయనిస్తోంది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పందిల్లకు చెందిన మూడెడ్ల సరవ్వ తనకున్న వ్యవసాయ భూమిలో సంప్రదాయ పంటలతో పాటు కొంత విస్తీర్ణంలో పూల తోటలు పెంచుతున్నారు. 10 గుంటల్లో దొడ్డుమల్లె, మూడు గుంటల్లో సన్న జాజి మల్లె, గట్లవెంట కాగడా మల్లె వేస్తున్నారు. వీటితో పాటు కనకాంబరాలు, చామంతి, పట్టుకుచ్చులు వంటివి సాగుచేస్తున్నారు.

పూలమొగ్గలు

తండ్రి నుంచి నేర్చుకుని..

• సరవ్వ తన తండ్రి మారుపాక రాజయ్య నుంచి పూలసాగును నేర్చుకున్నారు. ఆయన 40 ఏళ్ల క్రితమే వివిధ రకాల పూలతోటలు సాగు చేసేవారు. • మొక్కల వద్ద కలుపు తీయడం, నీరందించడం, పూలు తెంపడానికి సరవ్వ ప్రత్యేకంగా ఒక మహిళా కూలీని నియమించుకున్నారు.

• దొడ్డు మల్లెచెట్లు వేసవిలో పూస్తాయి. ప్రస్తుతం సన్నజాజి, కాగడ మల్లెచెట్లు మాత్రమే పూస్తున్నాయి. సీజన్‌లో అయితే రోజుకు 3 నుంచి 4 కిలోలకు పైగా పూలు వస్తాయని, ప్రస్తుతం సన్నజాజి రోజుకు 2 కిలోల పూల దిగుబడి వస్తోందన్నారు.

నేరుగా వినియోగదారులకే విక్రయం

• పూసిన పూలను ఒక్కోసారి కిలోల చొప్పున, మిగతా సమయాల్లో మూరల చొప్పున విక్రయిస్తున్నారు. • రోజూ తెంపిన పూలను కుటుంబసభ్యులు మాలలు కడతారు. వాటిని సరవ్వ రోజూ సిద్దిపేటలో నేరుగా వినియోగదారులకు విక్రయిస్తోంది.

• ప్రస్తుతం మూరకు రూ.30 చొప్పున, రోజుకు 15 మూరలు విక్రయిస్తూ నిత్యం రూ.450కి పైగా ఆదాయం పొందుతున్నారు.

• పూల లభ్యత, పెళ్లిళ్లు, ఇతర శుభాకార్యాల సీజన్‌ను బట్టి ధరలు మారతాయని సరవ్వ కూతురు శ్రీలక్ష్మి తెలిపారు.

• కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఇతర పంటల కన్నా పూలసాగుతో మంచి లాభాలు పొందవచ్చని, వీటి ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ అవసరాలతో పాటు ఇతర పంటల పెట్టుబడికి ఉపయోగపడుతుందంటున్నారీ మహిళా రైతు.

పురుగు మందు తాగి యువకుడు...

యాలాల(జుంటిపల్లి), న్యూస్‌టుడే: పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని జుంటిపల్లికి చెందిన అంబాటి గోవిందమ్మ, రాములుకు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడు **అంబాటి శ్రీనివాస్** (24).. సొంత ట్రాక్టర్ నడుపుకుంటూ రెండెకరాల పొలంలో వ్యవసాయం చేసేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన శ్రీనివాస్ తరచూ.. కడుపునొప్పితో బాధపడేవాడు. కొత్త ఇంటి నిర్మాణంలోనూ అప్పులు కావడంతో మానసికంగా కుంగిపోయాడు. ఆదివారం రాత్రి ఇంట్లో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు వికారాబాద్‌లోని మిషనరీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా.. సోమవారం తెల్లవారుజామున చనిపోయాడు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఉరేసుకొని రైతు..

తాండూరు గ్రామీణ: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాండూరు మండలం సంకిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. **నందురెడ్డి** (30) వ్యవసాయం చేస్తున్నాడు. ఆదివారం కుటుంబ సభ్యులంతా బంధువుల వివాహానికి వెళ్లారు. నందురెడ్డి పొలం పనులకు వెళ్లాడు. స్థానికులు ఫోన్ చేస్తే స్పందించలేదు. పొలం వద్ద పరిశీలించగా షెడ్డులో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. నందురెడ్డికి భార్య, కుమార్తె, నెలన్నర కుమారుడున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అంతర్రాష్ట్ర మహిళా దొంగ అరెస్టు

పోలీసులు అరెస్టు చేసిన నిందితురాలు

తాండూరు, వికారాబాద్, న్యూస్‌టుడే: ఒంటరిగా ఉంటున్న వితంతు, వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకొని బంగారు ఆభరణాల చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర మహిళా దొంగను సీసీఎస్ పోలీసులు తాండూరు పట్టణంలో అరెస్టు చేశారు. వికారాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్‌రాయ్ సోమవారం వికారాబాద్ ఠాణాలో విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని షోలాపూరు భీమ్‌నగర్ ప్రాంతానికి చెందిన లక్ష్మీ అసాడే తాండూరు పట్టణ ఠాణా పరిధిలో జరిగిన 5 చోరీల్లో 9.5 తులాల బంగారు ఆభరణాలు అపహరించింది. చోరీలను ఛేదించేందుకు ఎస్పీ స్నేహమెహ్రా వికారాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్‌రాయ్‌కి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు నేరాలు జరిగిన తీరును క్షుణ్నంగా పరిశీలించి సాంకేతిక పరిజ్ఞానంతో నిందితురాలి కదలికలను గుర్తించారు. లక్ష్మీ అసాడే ఒంటరిగా ఉంటున్న వితంతు, వృద్ధ మహిళలతో పరిచయం పెంచుకుంటుంది. దృష్టి మరల్చి వారు ధరించిన బంగారు గొలుసులు, నెక్లెస్‌లు, గాజులను ఎత్తుకెళుతుంది. వరుసగా జరిగిన కేసుల్లో సారూప్యతను పోలీసులు గుర్తించారు. తాండూరు, కర్ణాటక రాష్ట్రంలో నమోదైన కేసుల మధ్య ఉన్న నేరాల విధానాన్ని పోల్చి చూశారు. సోమవారం నిందితురాలు తాండూరు బస్టాండ్ సమీపంలో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేసి దర్యాప్తు ప్రారంభించారు. షోలాపూరు జిల్లా ఎంఐడీసీ ఠాణా పరిధిలో 3, బార్షి, హైదరాబాద్ సిటీ మార్కెట్ ఠాణాల పరిధిలో ఒక్కో కేసు నమోదైందని గుర్తించారు. తాండూరులో మాదిరిగానే కర్ణాటక రాష్ట్రంలోని గదక్‌టౌన్‌లో 2, నవనగర్ ఠాణా పరిధిలో ఒక చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మూడు కేసుల్లో 14.5 తులాల బంగారు ఆభరణాల చోరీల్లో నిందితురాలి ప్రమేయమున్నట్లు గుర్తించామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. తాండూరు పట్టణ ఎస్సై మమత, హెడ్ కానిస్టేబుళ్లు జయవర్ధన్, శివకుమార్, పాండు, రాజు, రవీందర్, గాయత్రిని అదనపు ఎస్పీ రాజేశ్‌మీనా అభినందించారు.

ఎస్సీ విద్యార్థులకు టాప్ క్లాస్

• దరఖాస్తు చివరి తేదీ 31 అక్టోబరు

మీకోసం

సిద్దిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత చదువులు కొందరికి కల మాత్రమే. నిరుపేద ఎస్సీ విద్యార్థుల చదువును ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం 'టాప్ క్లాస్' పథకం ద్వారా అండగా నిలుస్తోంది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి దేశవ్యాప్తంగా సుమారు 2,000 మంది విద్యార్థులకు ఈ ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఎంపికైన విద్యార్థులకు ల్యాప్‌టాప్, పుస్తకాలు, స్టేషనరీ మరియు ఇతర విద్యా సంబంధిత ఖర్చుల నిమిత్తం మొదటి ఏడాది రూ.86,000 అందజేస్తారు. ఆ తర్వాత ప్రతి ఏటా రూ.41,000 చొప్పున ఇస్తారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు ట్యూషన్ ఫీజుతో పాటు ఇతరాలను ప్రభుత్వమే భరిస్తుంది.

అర్హతలు: • ఎస్సీ కేటగిరీకి చెందిన విద్యార్థులై ఉండాలి. • కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షల లోపు ఉండాలి. • ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐఎం తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రముఖ విద్యా సంస్థల్లో రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. • మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. • మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది. • 30 శాతం బాలికలకు కేటాయించారు. • నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా దరఖాస్తు సమర్పించాలి. • ఒక కుటుంబంలో ఇద్దరికే వర్తిస్తుంది. • ఇతర ఉపకార వేతనాలు పొందుతుంటే అనర్హులు.

హత్య, పోక్సో కేసులో నిందితుడికి జీవితఖైదు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: సిద్దిపేట పట్టణంలోని రెండో ఠాణా పరిధిలో హత్య, పోక్సో కేసులో నిందితుడికి జీవితకాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సిద్దిపేట న్యాయస్థానం న్యాయమూర్తి వై.జయప్రసాద్ సోమవారం తీర్పు వెలువరించారు. రెండో ఠాణా సీఐ మురళి తెలిపిన వివరాలు.. బిహార్ రాష్ట్రానికి చెందిన బోలోరామ్ హరిజన్ అనే వ్యక్తి గతంలో మైనర్ బాలికను పెళ్లి చేసుకున్నాడు. అనంతరం ఆమెను ఇంట్లో చంపి మృతదేహాన్ని దాచిపెట్టిన ఘటనలో 2025, మార్చి 1న నిందితుడిపై సిద్దిపేట రెండో ఠాణాలో కేసు నమోదైంది. కేసులో భాగంగా అప్పటి సీఐ ఉపేందర్ సమగ్ర దర్యాప్తు నిర్వహించి పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయమూర్తి జయప్రసాద్.. హత్య కేసులో నిందితుడైన బోలోరామ్ హరిజన్‌కు జీవితకాల కఠిన కారాగార శిక్ష, పోక్సో కేసులో కఠిన కారాగార శిక్షతో పాటు రూ.25,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

బీడీ, సిగార్ రాష్ట్ర అధ్యక్షుడిగా గోపాలస్వామి

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కాముని గోపాలస్వామి ఎన్నికయ్యారు. సిద్దిపేటలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర మహాసభలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్.రమ, కోశాధికారిగా బాలమణి, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, భాస్కర్, పద్మ, మోహన్, పుష్ప, చౌదరి, కార్యదర్శులుగా శోభ, సత్యం, రాజు, సులోచన, రాష్ట్ర కమిటీ సభ్యులుగా అంజయ్య, భాస్కర్, శ్యామల, లావణ్య, లహరి, గణేశ్ ఎన్నికయ్యారు.

మహిళల రక్షణకు అనేక చట్టాలు: పద్మజా రమణ

చేర్యాల: మహిళల రక్షణకు ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొచ్చాయని, ఏ సమస్య ఎదురైనా నేరుగా కమిషన్ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటామని తెలంగాణ మహిళా కమిషన్ రాష్ట్ర కార్యదర్శి పద్మజా రమణ అన్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాల కస్తూర్బా విద్యాలయంలో సోమవారం జరిగిన మహిళలు, బాలికల భద్రత, ఆరోగ్యం, హక్కులపై అవగాహన కార్యక్రమంలో ఆమె హాజరై మాట్లాడారు. సుమోటో కేసులు స్వీకరిస్తామని, బాలికలు చట్టపరమైన రక్షణ సహాయ వ్యవస్థలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా మహిళా, శిశుసంక్షేమ అధికారిణి శారద, తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

వైభవోపేతంగా వీరభద్రేశ్వరస్వామి కల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

దుద్యాల, న్యూస్‌టుడే: మండలంలోని ఈడ్లపల్లి శివారులో గుట్టపై వెలిసిన వీరభద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను రెండు రోజులుగా వైభవంగా నిర్వహించారు. సోమవారం స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని జరిపారు.

పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి: సీపీఎం

పూడూరు: గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లలేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి. రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. పార్టీ పిలుపు మేరకు పూడూరు తహసీల్దారు కార్యాలయంలో వివిధ డిమాండ్‌లతో కూడిన వినతి పత్రం అందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. నర్సిములు, విజయ్, తిరుపతి ఉన్నారు.

బియ్యం తరలిస్తున్న డీసీఎం స్వాధీనం

డీసీఎం తనిఖీ చేస్తున్న పోలీసులు

ధారూర్: బియ్యం లోడుతో వెళ్తున్న డీసీఎం అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించిన సంఘటన సోమవారం ధారూర్‌లో చోటుచేసుకుంది. సీఐ రఘురాం తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ నుంచి తాండూరు వైపు వెళ్తున్న డీసీఎం అదుపులోకి తీసుకొని పరిశీలించగా అందులో బియ్యం ఉన్నట్లు గుర్తించాం. ఈ మేరకు సివిల్ సప్లై అధికారులకు సమాచారమిచ్చాం. వారి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం అని తెలిపారు.

ఎల్‌నినో.. సాగు ఎలానో!

న్యూస్‌టుడే, దోమ: గ్రామాల సుభిక్షానికి ఆయువుపట్టు చెరువులే. ఎల్‌నినో ప్రభావంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. చెరువులు నిండక భూగర్భజలాలు అడుగంటి రానున్న కాలంలో దుర్భిక్ష పరిస్థితులు వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. చెరువుల్లో ఉన్న నీళ్లు కాస్త ఇంకిపోతే తాగునీటి కష్టాలు తప్పవు. జిల్లాలో 100 ఎకరాలు పైబడిన 164 చెరువులు, 100 ఎకరాల్లోపు ఉన్నవి 1,015 ఉన్నాయి. ఇప్పటి వరకు కురిసిన వర్షాలకు అక్కడక్కడ 10 శాతం చెరువులు, కుంటలు నిండాయి. ఇంకా 90 శాతం చిన్ననీటి వనరుల్లోకి పాటు పారలేదు. నీరు చేరలేదు. దీంతో ఆయకట్టు పొలాలు బీడులుగా మారాయి.

ఉదాహరణలు..

✦ దిర్శంపల్లికి చెందిన రైతు హన్మంతుకు ఎకరం పొలం ఉంది. సూర సముద్రం చెరువు నిండక పొలం బీడుగా మారింది. కుటుంబ పోషణ కష్టాలు తప్పడం లేదు. ✦ దొంగెన్సేపల్లి కొత్తచెరువులోకి చుక్కనీరు రాలేదు. ఆయకట్టు కింది రైతులు నారు మళ్లు పోసినా నీళ్లు లేక ఆశలు వదులుకున్నారు.

జిల్లాలో సన్న, చిన్నకారు రైతులే అధికం

ఐనాపూర్ పెద్ద చెరువు 656 ఎకరాల ఆయకట్టు ఉంది. దీని కింద సన్నచిన్నకారు రైతులే అధికం. ఎకరం, రెండెకరాలు ఉన్న వారే ఉన్నారు. చెరువులో నీరుంటేనే పంట పండుతుంది. పిల్లాపాపా పొట్టనిండుతుంది. జీవనం సాగుతుంది. కానీ ఎల్‌నినో ప్రభావంతో పరిస్థితి తారుమారింది. ఆశగా ఎదురుచూస్తున్నా మబ్బులు కమ్ముకున్నాయి తప్ప వరుణుడు కరుణించడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటల కింద 1,29,255 ఎకరాల ఆయకట్టు సాగుకుగాను సగానికి పైగా ఆయకట్టు పొలాలు బీడుగా దర్శనమిస్తున్నాయి.

బీడుగా ఐనాపూర్ పెద్ద చెరువు ఆయకట్టు

వర్షం కురిస్తేనే పరిస్థితులు మారతాయి..

–వ్యవసాయాధికారి ప్రభాకర్‌రావు

ఎల్‌నినో ప్రభావంతో చెరువులు, కుంటల కింద సగానికి పైగా వరిసాగు చేయలేదు. గొట్టపు బావుల ఆధారంగా సాగు చేసినా అడుగంటిన జలంతో ఇబ్బందులు తప్పవు. వరుణుడు కరుణిస్తేనే మేలు జరుగుతుంది.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత: ఎమ్మెల్యే

నవాబ్‌పేట, నవాబ్‌పేట: మండల పరిధిలోని చిట్టిగిద్ద గ్రామంలో కొలువైన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో నూతనంగా నిర్మించనున్న కల్యాణ మండప పనులను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామివారి ఆశీస్సులతో, గ్రామస్థుల సహకారంతో కల్యాణ మండప నిర్మాణానికి అంకురార్పణ జరగడం సంతోషకరమని, ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. గ్రామాల అభివృద్ధి, ఆధ్యాత్మిక కేంద్రాల విస్తరణకు తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. సర్పంచి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీఏసీఎస్, ఏఎంసీ ఛైర్మన్లు పోలీస్ రాంరెడ్డి, ఆర్. గీతాసింగ్ పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు చిట్టెపు మల్లారెడ్డి, టి. ప్రభాకర్, ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపన

పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

ధారూర్: ధారూర్ మండల కేంద్రంలో గత మూడు రోజులుగా గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా కొనసాగాయి. అందులో భాగంగా సోమవారం యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, సామూహిక రుద్రహోమం, రుక్మిణీ సమేత శ్రీ పాండురంగ స్వామి ప్రతిష్ఠ, అలంకరణ, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన వితరణ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం ప్రజలు గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో భారాస మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, భాజపా జిల్లా అధ్యక్షులు రమేష్, సంపూర్ణ ఆనంద్, స్థానిక నాయకులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్ కలెక్టరేట్: 9121229018
తాండూరు టౌన్: 80086 11300
పరిగి: 80085 73272
కొడంగల్(గ్రామీణ: 9063144754
తాండూరు: 8008902815
(10 AM TO 1 PM)

పూడూరు, న్యూస్‌టుడే: ? గ్రామంలోని పాఠశాల సమీపంలో మురుగు కాలువలు సక్రమంగాలేక దారిపైకి వస్తుంది. ఇబ్బందులు పడుతున్నాం.
– వెంకటేశ్, చెంచుపల్లి

✓ కాలువల నిర్మాణానికి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతాం.– సుందర్, ఎంపీవో

తాండూరు పట్టణం, న్యూస్‌టుడే: ? తాండూరు- హైదరాబాద్ మార్గంలోని రాజీవ్ గృహకల్ప వద్ద రోడ్డుపైనే చెత్త వేస్తున్నారు. దారంతా అపరిశుభ్రంగా మారుతోంది.
–వినోద్, ఇందిరమ్మ కాలనీ

✓ పారిశుద్ధ్య సిబ్బందిచేత శుభ్రం చేయిస్తాం. రోడ్డుపై చెత్త వేసేవారిని హెచ్చరిస్తాం. – రాకేశ్‌రెడ్డి, పుర కమిషనర్ తాండూరు

దౌల్తాబాద్,న్యూస్‌టుడే: ? యాంకి గ్రామంలోని పలు కాలనీలలో మురుగు నీరు సీసీ రోడ్లపై పారి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. -శ్రీనివాస్,కాలనీవాసి

✓ కొన్నిచోట్ల మురుగు కాల్వలు అసంపూర్తిగా ఉండడంతో సమస్య ఏర్పడింది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.
– మానిక్యప్ప, సర్పంచి, యాంకి

ధారూర్, న్యూస్‌టుడే : ? గ్రామంలో పూర్తి స్థాయిలో అంతర్గత మురుగు కాలువలు లేకపోవడంతో మురుగునీరు పరిసరాల్లో చేరి అపరిశుభ్రంగా మారుతున్నాయి.
–రమేష్, నాగసమందర్

✓ ఉన్నతాధికారులకు వివరించి అంతర్గత మురుగు కాలువలు నిర్మించేలా చూస్తాం.
–వెంకటేష్, గ్రామ సర్పంచి,నాగసమందర్

పరిగి, న్యూస్‌టుడే: ? ఎరువుల బుకింగ్ యాప్‌లో అవసరమైన చోట తీసుకునేందుకు బుకింగ్ కావడం లేదు. – నర్సిములు, వెంకట్రాములు, రైతులు

✓ కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇంతకుముందు మాదిరిగా కాకుండా డివిజన్ స్థాయిలోనే ఎక్కడైనా బుకింగ్ చేసుకుని తీసుకునే అవకాశం కల్పించింది. పక్క డివిజన్‌లో తీసుకునేందుకు వీలు లేదు.– రజిత, వ్యవసాయాధికారిణి

సరిపడా మందులున్నాయి.. ఆందోళన వద్దు..

5వ పేజీ తరువాయి..

? సీజనల్ రోగాలను తగ్గించే మందులు వికారాబాద్ ఆసుపత్రిలో లేవు. అవసరమైన వాటిని బయట కొంటున్నాం. ఆసుపత్రిలో ఆయాల పని తీరు బాగాలేదు. – సుశీల్‌కుమార్, వికారాబాద్

డీఎంహెచ్‌వో: వికారాబాద్ ఆసుపత్రి వైద్యవిధాన పరిషత్తు పరిధిలో ఉంది. ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సమాచారం ఇచ్చి సమస్యను పరిష్కరించేలా చూస్తాను.

? ధారూర్ ఆసుపత్రిలో రోగులకు అవసరమైన పరీక్షలు చేయడం లేదు. మిషన్లు పాడయ్యాయని సిబ్బంది చెపుతున్నారు.
– మహ్మద్‌ఖాన్, ధారూర్

డీఎంహెచ్‌వో: ఒకట్రెండు రోజులు మిషన్లు పనిచేయలేదు. ఇప్పుడు పనిచేస్తున్నాయి.

? తాండూరు జిల్లా ఆసుపత్రిలో ఐసీయూ కేంద్రం ఏర్పాటు చేయాలి.
– హన్మంత్, తాండూరు

డీఎంహెచ్‌వో: తాండూరులో ఐసీయూ కేంద్రానికి అవసరమైన పరికరాలు సరఫరా చేశారు. వాటిని బిగించాల్సి ఉంది.

? తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గుండె శస్త్ర చికిత్సలు చేసే సదుపాయం కల్పించాలి.
– శ్రీనివాస్, తాండూరు

డీఎంహెచ్‌వో: ఆసుపత్రిలో కార్డియాలజిస్టు ఉన్నారు. ఆపరేషన్లు చేస్తారు.

నేటి నుంచి రైతు నేస్తం

కుల్కచర్ల, న్యూస్‌టుడే: రైతుల కోసం నేటి నుంచి రైతునేస్తం కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఏర్పాటు చేస్తోంది. ఉదయం 10 నుంచి 10:30 వరకు పలువురు శాస్త్రవేత్తలతో సలహాలు, సూచనలు ఇప్పించనున్నారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావం, వాతావరణం, వర్షపాతం, అపాయ పరిస్థితిలో పంటలు, ప్రత్యామ్నాయ పంటలు, ఎరువుల వినియోగం, నానో యూరియా వాడకం లాంటి విషయాలపై శాస్త్రవేత్తలతో మాట్లాడేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వ్యవసాయశాఖాధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించే ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు పాల్గొంటారని తెలిపారు.

నేడు రీ సర్వే గ్రామ సభ

యాలాల(శ్రీరామపూరం), న్యూస్‌టుడే: నేడు మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ గ్రామానికి చెందిన భూములను హనుమాన్ దేవాలయం వద్ద రీ సర్వే గ్రామ సభ ఏర్పాటు చేసినట్లు యాలాల తహసీల్దార్ గాయత్రి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10: 30గంటలకు నిర్వహించే సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. రైతులు సకాలంలో హాజరుకావాలని తహసీల్దార్ సూచించారు.

పేదల సొంతింటి కల నెరవేర్చాం: ఎమ్మెల్యే

ఇంటిని ప్రారంభిస్తున్న బుయ్యని మనోహర్‌రెడ్డి

యాలాల(దౌలాపూర్), న్యూస్‌టుడే: పేదల సొంతింటి కలను నెరవేర్చింది కాంగ్రెస్ పార్టీనే అని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం యాలాల మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారురాలు షబాన ఇంటి ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు.

తాండూరు పట్టణం, న్యూస్‌టుడే: ఇంటర్ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల స్వాగత కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కష్టపడి చదివితే.. అనుకున్నది సాధిస్తామన్నారు. కార్యక్రమంలో ఇంటర్ జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాండూరు, న్యూస్‌టుడే: పేద ప్రజలకు సంక్షేమ పథకాల్లో అర్హత కల్పించే గుర్తింపు రేషన్ కార్డే అని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దేముల్ మండలంలోని లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులు అందజేశారు

కుల్కచర్ల: అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరీ చేయిస్తామని పీఏసీఎస్ ఛైర్మన్ బీంరెడ్డి తెలిపారు. కుల్కచర్ల మండల కేంద్రంలో సోమవారం ఇందిరమ్మ ఇంటిని ఎంపీడీవో రామకృష్ణానాయక్‌తో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. సర్‌లో భాగంగా సోమవారం మండలంలోని పుట్టపహాడ్, ఇప్పాయిపల్లిలో నిర్వహించిన గ్రామసభలో కాంగ్రెస్ నాయకులు పాల్గొని సూచనలు చేశారు.

సమస్యలను నిర్భయంగా చెప్పండి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న 'షీ' టీం సభ్యులు

వికారాబాద్, న్యూస్‌టుడే: మహిళల సమస్యలపై వెంటనే స్పందించి సమాచారం అందించాలని 'షీ' టీం బృందం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 'షీ' టీం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. దాని ప్రాముఖ్యత, టీ సేఫ్ యాప్, సైబర్ నేరాలు, పోక్సో, ట్రాఫిక్ నిబంధనలు, మహిళల రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏ సమస్య ఎదురైనా సంకోచించకుండా 181, డయల్ 100లకు కాల్ చేయాలని సూచించారు. వేధింపులను భరిస్తే ఇంకా అధికమవుతాయని, ఎదిరించి ఫిర్యాదు చేస్తేనే అన్ని విధాలుగా శ్రేయస్కరమని అన్నారు. కార్యక్రమంలో 'షీ' టీం బాధ్యుడు బుచేందర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ పుష్పలత, పోలీసు కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిదీ స్కాన్ చేయాలి: తహసీల్దార్

కుల్కచర్ల, న్యూస్‌టుడే: మీసేవలో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే ప్రతి అర్జీకి తగు పత్రాలు స్కానింగ్ చేసి పంపాలని కుల్కచర్ల తహసీల్దార్ పురుషోత్తం సూచించారు. సోమవారం ఆయన తన ఛాంబర్‌లో ఉప తహసీల్దార్ చంద్రశేఖర్‌తో కలిసి మీసేవా నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ప్రతి అర్జీకి సంబంధించిన ఆధార్, ఆహార భద్రతకార్డుతో పాటు ఆయా నిరూపణ ప్రతులు స్కానింగ్ చేసి దరఖాస్తులు చేయాలన్నారు. వినియోగదారులకు ఇబ్బందులు రానీయకుండా అవగాహన కల్పించాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి జైలుశిక్ష

బంట్వారం, న్యూస్‌టుడే: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి జైలుశిక్ష పడింది. ఎస్సై విమల తెలిపిన వివరాలు.. కోట్‌పల్లి మండలం కొత్తపల్లికి చెందిన వ్యక్తి బంట్వారంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరు పరచగా.. న్యాయమూర్తి జైలుశిక్ష విధించారు.

నమ్మండి.. ఇది ప్రయాణ ప్రాంగణమే!

మండలంలోని దుద్యాల స్టేజీ సమీపంలో గతంలో వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్మించిన ప్రయాణ ప్రాంగణం శిథిలావస్థకు చేరింది. సగం మేర కూలిపోయి పిచ్చి మొక్కలు పెరిగి ప్రమాదకరంగా మారింది. ఇతర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు నిలబడేందుకు ప్రాంగణం లేకపోవడంతో వానకు తడుస్తూ.. ఎండకు ఎండుతూ ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ప్రాంగణానికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, దుద్యాల

వరి పంట పరిశీలన

చౌడాపూర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పంట నమోదు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని చాకల్‌పల్లి గ్రామంలో వరి పంటను వ్యవసాయాధికారిణి శిరీష పరిశీలించి, మాట్లాడారు. గ్రామంలోని ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్, సర్పంచి పటేల్ చెన్నయ్య తదితరులున్నారు.

కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

చౌడాపూర్, న్యూస్‌టుడే: చౌడాపూర్ మండల పరిధిలోని మందిపాల్ గ్రామంలో భారాస కార్యకర్త కేశవులు కాలుకు చికిత్స జరిగిన విషయమై మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం మక్తవెంకటాపూర్ బంగారు మైసమ్మ బోనాల పండగలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సీటీవో రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామికి నక్షత్ర హారతులు

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: శ్రావణ మాసం సోమవారం సందర్భంగా తాండూరు మండలం జిన్‌గుర్తిలోని రామలింగేశ్వరస్వామికి అర్చకులు శివకుమార్ నక్షత్ర హారతులు ఇచ్చారు. అంతకుముందు భక్తుల చేత పరమశివుడికి పంచామృత అభిషేకాలను నిర్వహించారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల సోదాలు

కొడంగల్, న్యూస్‌టుడే: పురపాలికలోని ఎరువుల దుకాణాల్లో డీఏపీ, యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్నారనే సమాచారంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఇన్‌ఛార్జి ఏవో కొండయ్య మాట్లాడుతూ వైష్ణవి, ఓం ట్రేడింగ్ దుకాణాల్లో రికార్డులు పరిశీలించారన్నారు. వైష్ణవి ఫర్టిలైజర్ దుకాణంలో ఎరువుల విక్రయాలు నిలిపివేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారన్నారు.

రూ.25లక్షలతో సిమెంటు దారి

తాండూరు పట్టణం, న్యూస్‌టుడే: తాండూరు పట్టణం 8వ వార్డులో రూ.25లక్షలతో నిర్మాణం చేస్తున్న సిమెంటు దారి పనులను పుర అధ్యక్షురాలు పట్లోళ్ల నీరజ, వైస్ ఛైర్మన్ రజాక్, కౌన్సిలర్లు ప్రారంభించారు. పట్టణంలోని అన్ని వార్డులను విడతల వారీగా అభివృద్ధి చేస్తామని ఆమె పేర్కొన్నారు. కమిషనర్ రాకేష్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

పరిగి,న్యూస్‌టుడే: పరిగి మండల సమావేశం మంగళవారం జరగనున్నట్లు మండల అభివృద్ధి అధికారి హరిప్రియరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు జరిగే సమావేశానికి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని మండల, డివిజన్ స్థాయి అధికారులు, సర్పంచులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

బస్టాండులో శౌచాలయాల నిర్మాణం

బంట్వారం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బస్టాండులో శౌచాలయాల నిర్మాణం చేపడుతున్నట్లు స్థానిక సర్పంచి మల్లేశం తెలిపారు. సోమవారం ఆయన, ఎంపీడీవో రాములు, తదితరులతో కలిసి భూమి పూజ చేసి, మాట్లాడారు. స్వచ్ఛభారత్ మిషన్ కింద రూ.2 లక్షల 10 వేలు, గ్రామపంచాయతీ నిధులు రూ. 90 వేలు వెచ్చించి శౌచాలయాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి శ్రావణి, డైరెక్టర్ యాదగిరిలున్నారు.

దొంగ అరెస్ట్.. బంగారం స్వాధీనం

తాండూరు పట్టణం, న్యూస్‌టుడే: వృద్ధురాలి మెడలో నుంచి బంగారాన్ని దొంగతనం చేసిన దొంగను పోలీసులు పట్టుకుని, బంగారం స్వాధీనం చేసుకున్నారు. తాండూరు పట్టణ సీఐ పరమేశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణం బసవేశ్వర్‌నగర్‌లో దంపతులు ఉమాదేవి, సుభాన్‌రెడ్డి నివాసం ఉంటున్నారు. వీరి వద్ద పని చేసిన బుజ్జమ్మ భర్త మొగులప్ప, స్నేహితుడు సంజీవ్‌తో కలిసి శనివారం ఉమాదేవి ఇంటికి వచ్చి, ఆమె మెడలోని పుస్తెలతాడు, నల్లపూసల దండను లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటనలో ఉమాదేవి మెడకు తీవ్ర గాయమై చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సంజీవ్‌ను పట్టుకొని 5 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. మొగులప్ప పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

EENADU Classifieds

REAL ESTATE

LAND FOR SALE

జనగాం- హుస్నాబాద్ హైవే దగ్గరలో 1.35 ఎకరం ఎర్ర నేల తూర్పు ఫేసింగ్‌తో 600ft పొడవు 150ft వెడల్పుతో బోర్ & జాలీ ఫెన్సింగ్‌తో అమ్మబడును. పౌల్ట్రి ఫామ్స్/ ఏ ఫామ్ హైనా/ఏ తోటకైనా అనుకూలం. ✆ 8019095973.

JOBS

MARKETING/ SALES

రియల్ ఎస్టేట్ శాలరీ బేస్ మార్కెటింగ్ డైరెక్టర్ కావలెను. స్మార్ట్ సిటీ, జహీరాబాద్ NIMZ 5KM, శే. 3,50,000/- ప్లాట్, EMI, స్పా. రిజి. Sal+inc= 50K ✆ 9281447559

క్లాసిఫైడ్ ప్రకటనలకు సంప్రదించండి:
9000766012

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రోడ్డు సమస్య పరిష్కరించాలని వినతి

పూడూరు, న్యూస్‌టుడే: ఎంతో కాలంగా ఇబ్బందిగా మారిన అంగడిచిట్టంపల్లి, లాల్‌పహాడ్ రోడ్డు సమస్యను తీర్చాలని భాజపా నాయకులు సోమవారం సచివాలయంలో రోడ్లు, భవనాలశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్‌రాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఐటీ ఇన్‌ఛార్జి రవీందర్, మన్‌కీబాత్ ప్రోగ్రాం జిల్లా కో కన్వీనర్ కన్నయొల్ల రాజు మాట్లాడుతూ ఈ దారిని మరమ్మతులు చేసేందుకు కంకర పరిచి ఏళ్లకాలంగా వదిలేయటంతో వాహనాలు అదుపు తప్పి అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. పలు మార్లు అధికారులకు విన్నవించినా సమస్య తీరడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శివరాజ్ తదితరులున్నారు.

నేడు నల్లబ్యాడ్జీలతో నిరసన

దుద్యాల, కొడంగల్ గ్రామీణ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ నేడు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపడుతున్నట్లు టీజీసీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ తెలిపారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అక్టోబరు 2న ఇందిరా పార్కు వద్ద సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నామన్నారు. సంఘాలకతీతంగా ఉపాధ్యాయులు మంగళవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

ఫిర్యాదీదారులతో స్నేహపూర్వకంగా మెలగాలి

గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఎస్పీ అంజయ్య

కోట్‌పల్లి, న్యూస్‌టుడే: ఠాణాకు వచ్చిన ఫిర్యాదుదారులతో సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని డీఎస్పీ అంజయ్య సూచించారు. సోమవారం కోట్‌పల్లి ఠాణాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఎప్పటికప్పుడు గస్తీ కాస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పలు దస్త్రాలను పరిశీలించారు. సీఐ రఘురాములు, ఎస్సై శైలజ, సిబ్బంది ఉన్నారు.

చేయూత దరఖాస్తు గడువు పెంపు

కుల్కచర్ల,న్యూస్‌టుడే: పింఛన్‌ల దరఖాస్తుల గడువును ఈనెల 15 వరకు పొడిగించినట్లు కుల్కచర్ల ఎంపీడీవో కె.రామకృష్ణ తెలిపారు. ఆగస్టు 31 వరకు ఉన్న ఈ గడువును ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పెంచినట్లు చెప్పారు. దరఖాస్తు సమయంలో ఇచ్చే ధ్రువీకరణ పత్రాలు కొందరికి లభించని కారణంగా ప్రభుత్వం పొడిగించిందన్నారు.

ప్రజావాణికి నాలుగు అర్జీలు

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తాండూరు మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నలుగురు అర్జీలు ఇచ్చారని ఎంపీడీవో విశ్వప్రసాద్, తహసీల్దారు కేతావత్ తారాసింగ్ తెలిపారు.

కుల్కచర్ల, న్యూస్‌టుడే: కుల్కచర్లలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెండు దరఖాస్తులు వచ్చినట్లు కార్యాలయ పర్యవేక్షకుడు శ్రీనివాస్ తెలిపారు. రెవెన్యూ, పోలీసు శాఖకు సంబంధించిన రెండు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

దళితులు వివక్షకు గురవుతున్నారు: కోశాధికారి

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: దళితులు నేటికీ వివక్షకు గురవుతున్నారని రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి శోభన్ అన్నారు. సోమవారం పట్టణంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సామాజిక శిక్షణ తరగతుల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నేటికి భూమి లేని నిరుపేదలు ఎంతో మంది ఉన్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మకు బోనాలు

చౌడాపూర్: మండల పరిధిలోని మక్తవేంకటపూర్‌లో బంగారు మైసమ్మ బోనాలు వైభవంగా జరిగాయి. చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు మహారాష్ట్ర, ముంబయిల నుంచి కూడా అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు.

చకాచకా మరమ్మతులు.. తీరుతున్న పాట్లు

పరిగి, న్యూస్‌టుడే: రైతులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ఏర్పాటు చేసిన నియంత్రికల మరమ్మతు కర్షకులకు బాసటగా నిలుస్తోంది. ఒకప్పుడు అవి కాలిపోతే బాగు చేయించేందుకు దూరంలో ఉన్న వికారాబాద్‌కు తీసుకెళ్లి తిరిగి తీసుకువచ్చే సరికి ఉన్న పంటలు చేతికందేవి కాదు. రైతుల కష్టాలను గుర్తించి 1997 డిసెంబరు 21న అప్పటి ఎమ్మెల్యే, రాష్ట్ర ఆర్థిక సంస్థ ఛైర్మన్ కొప్పుల హరీశ్వర్‌రెడ్డి కృషితో ప్రారంభం కావడంతో అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. గడిచిన నాలుగు నెలల్లో 209 నియంత్రికలు మరమ్మతులకు గురయ్యాయి. ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్తు వినియోగం పెరగడంతో అవి తరచూ మొరాయిస్తున్నాయి. డివిజన్ వ్యాప్తంగా ఇప్పటి వరకు 1,14,976 ఎకరాల్లో పంటలు సాగులోకి వచ్చాయి. ఇంకా వరి నాట్లు వేస్తున్నారు.

మండలాల వారీగా విద్యుత్తు కనెక్షన్లు.. నాలుగు నెలల్లో కాలిన నియంత్రికలు ఇలా..

మండలం	నియంత్రికలు	మే	జూన్	జులై	ఆగస్టు
కుల్కచర్ల	3,543	3	7	11	13
దోమ	5,205	3	26	23	22
చౌడాపూర్	1,933	2	6	4	4
పరిగి	4,936	9	14	18	13
మన్నెగూడ	3,852	7	11	9	4

20వేల విద్యుత్తు కనెక్షన్లు..

జిల్లాలోనే పరిగి నియోజకవర్గం వ్యవసాయాధారిత ప్రాంతం. పరిగి, దోమ, పూడూరు, కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో ఉపకేంద్రాల సంఖ్య 18వరకు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 75వేల మంది రైతులు ఉండగా వ్యవసాయ కనెక్షన్లు దాదాపు 20వేల వరకు ఉన్నాయి. అనధికారికంగా మరో 2,500 వరకు ఉన్నాయి. నియంత్రికను తీసుకువచ్చిన వెంటనే కేంద్రంలో మరమ్మతు పనులు పూర్తిచేసి అందజేస్తున్నారు. దీంతో సకాలంలో పంటలకు నీరందించేందుకు అవకాశం ఉంటోంది.

నియంత్రికకు మరమ్మతు చేస్తూ..

వాహనం కేటాయిస్తే..

కాలిన నియంత్రికలను రైతులు ప్రైవేట్ వాహనాల్లో పరిగికి తీసుకురావాల్సి వస్తోంది. ట్రాన్స్‌కో అధికారులు అద్దె చెల్లిస్తామని చెబుతున్నారు. కానీ ప్రత్యేకించి వాహనం కేటాయిస్తే అన్ని విధాలుగా ప్రయోజనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా ప్రకటన
(భూముల కొనుగోలుకు సంబంధించి)

క్రింద పేర్కొన్న భూములను నా క్లయింట్ కొనుగోలు చేయదలచినారు. ఈ భూములకు సంబంధించి ఎవరికైనా యాజమాన్య హక్కు, వారసత్వ హక్కు, స్వాధీనం, అమ్మకం ఒప్పందం, తాకట్టు, లీజు, కోర్టు కేసు, ఇతర హక్కు లేదా ఆసక్తి, లేదా ఏదైనా అభ్యంతరం ఉన్నట్లయితే, ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 15 రోజులలోపు సంబంధిత పత్రాలతో క్రింద పేర్కొన్న చిరునామకు లిఖితపూర్వకంగా తెలియజేయాలి. 15 రోజులలోపు ఎటువంటి సమాచారం లేదా అభ్యంతరం అందని పక్షంలో, పై భూములపై ఎవరికీ ఎటువంటి హక్కు లేదా క్లెయిమ్ లేదని భావించి, నా క్లయింట్ కొనుగోలు ప్రక్రియను కొనసాగిస్తారు. ఆ తరువాత వచ్చే ఎటువంటి క్లెయిమ్ లేదా అభ్యంతరానికి నా క్లయింట్ బాధ్యులు కారు.

క్ర.సం.	భూమి యజమాని	సర్వే నంబర్	విస్తీర్ణం	గ్రామం/మండలం/జిల్లా
1	బంక సత్యమ్మ W/o. బంక రామయ్య	157/18/ ఆ1/2	Ac.1-21.3 Gts. (out of Ac. 2-00)	నారాయణపూర్/ పరిగి/ వికారాబాద్
2	పసుల సాయమ్మ W/o. అంజిలయ్య	159/అ/1/ 1/1/1	Ac.2-10 Gts. (out of Ac. 2-21)	నారాయణపూర్/ పరిగి/ వికారాబాద్
3	కుమ్మరి కిష్టయ్య S/o. కె. చెన్నయ్య	158/ఈ/1/2	8 Gts. approx. (out of 26 Gts.)	నారాయణపూర్/ పరిగి/ వికారాబాద్
4	కుమ్మరి కిష్టయ్య S/o. కె. చెన్నయ్య	159/అ/1/ 1/1/2	7 Gts. (out of 10 Gts.)	నారాయణపూర్/ పరిగి/ వికారాబాద్
5	కుమ్మరి శాంతయ్య S/o. కిష్టయ్య	36/ఇ	1.4 Gts. (out of Ac. 2-16 Gts.)	శివారెడ్డిపల్లి/దోమ/ వికారాబాద్
6	అనంతయ్య S/o. పెద్ద ఎల్లయ్య	159/ఇ	2 Gts. (out of Ac.1-11 Gts.)	నారాయణపూర్/పరిగి/ వికారాబాద్
7	పాండురయ్య S/o. జంబులయ్య	159/అ1/ 1/1	Ac.0-2.2 Gts. (out of Ac. 0-25 Gts.)	నారాయణపూర్/పరిగి/ వికారాబాద్

మొత్తం విస్తీర్ణం: Ac.4-11.9 Gts. (171.9 Gts.)

అభ్యంతరాలు/క్లెయిములు పంపవలసిన చిరునామా: S. RAGHAVENDRA REDDY, ADVOCATE, Office at: Flat No. 402, 4th Floor, Sirivennela Apartments, Behind Tanishq Showroom, Himayathnagar, Hyderabad, Ph: 8520060130, Email: sraghavendra.legal@gmail.com

(c) eenadu